


# కరపత్రం

SINCE 2014

సోమవారం ఆగస్ట్ 4 2025 | సంపుటి :0 | సంచిక :290 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన చిరంజీవి



హైదరాబాద్:
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సినీ నటుడు చిరంజీవి కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి వెళ్లి ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దీనికి సంబంధించిన వీడియోను సీఎంవో 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది.



2లో..

## కేసీఆర్ మాటలతోనే..
## ఏపీ 'బనకచర్ల' చేపట్టింది

- గోదావరి మిగులు జలాలపై కేసీఆర్ వ్యాఖ్యలే కారణం.
- తెలంగాణను వదిలి రాయలసీమపై ఆసక్తి చూపారు.
- సోషల్ మీడియాలో తెలంగాణ ప్రభుత్వంపై దుష్ప్రచారం.
- కవిత ఏ పార్టీలో ఉన్నారో తెలియదు: వ్యంగ్య వ్యాఖ్య.
- బీసీ కులగణన రాహుల్ గాంధీ ఆకాంక్షతోనే - రేవంత్ చర్య.
- ఇప్పుడు కవిత బీసీలపై ప్రేమ నటిస్తున్నట్లు విమర్శ.
- సమావేశంలో మీనాక్షి నటరాజన్, సీతక్క పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి:
మాజీ సీఎం కేసీఆర్ మాటలతోనే ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును చేపట్టిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. గోదావరిలో 3 వేల టీఎంసీల మిగులు జలాలు ఉన్నాయని, వాటిని ఏపీ వాడుకోవచ్చని గతంలో కేసీఆర్ అన్నారని.. అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసిందని చెప్పారు. తెలంగాణను వదిలేసి రాయలసీమను రతనాల సీమ చేస్తానని కేసీఆర్ వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో తెలంగాణ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

## బనకచర్లపై

- రాష్ట్ర అభ్యంతరాలపై కేంద్రం పర్యావరణ అనుమతులు నిలిపివేసింది.
- సీడబ్ల్యూసీ, గోదావరి బోర్డు, పోలవరం అథారిటీలు అనుమతులు తిరస్కరించాయి.
- ప్రాజెక్టు రాష్ట్ర విభజన చట్టం, 1980 ఒప్పందాలకు వ్యతిరేకం.
- బీఆర్ఎస్ నేతలు బాధ్యతారహిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శ.
- రాష్ట్ర జనాభాలో 84% మందికి సన్న బియ్యం పంపిణీ.
- రేషన్‌కార్డుల సంఖ్య 89 లక్షల నుంచి 98.59 లక్షలకు పెంపు.
- కొత్తగా 8.64 లక్షల కార్డులు జారీ.
- 3.17 కోట్ల మందికి నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ జరుగుతోందని స్పష్టం.

2లో..

## ఎంతవరకైనా పోరాడతాం
## - మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ధర్మారం:
ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఎంతవరకైనా పోరాడతామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాల మేరకే బనకచర్ల అనుమతులను సీడబ్ల్యూసీ, గోదావరి నదీ యజమాన్య బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ తిరస్కరించాయన్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ అభ్యంతరాలతో కేంద్రం పర్యావరణ అనుమతులు నిలిపివేసిందన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఉత్తమ్ పాల్గొన్నారు.


## నాగార్జునసాగర్ గేట్ల మూసివేత..!



నల్గొండ:
వర్షాలు తగ్గటంతో నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి వచ్చే వరద ప్రవాహం తగ్గింది. దీంతో ఆదివారం అధికారులు ప్రాజెక్టు 20 క్రస్ట్ గేట్లను మూసివేశారు.


2లో..

## చేవెళ్లలో కలకలం..
## ఫాంహౌస్‌లో ఐటీ ఉద్యోగుల డ్రగ్స్ పార్టీ



రంగారెడ్డి జిల్లా: చేవెళ్లలో డ్రగ్స్ కలకలం రేగింది.

## లింగంపేట మండలంలో చిరుత సంచారం



లింగంపేట:
మండలంలోని కంచుమల్ గ్రామ శివారులో శనివారం సాయంత్రం చిరుత పులి కనిపించింది. చిరుత రోడ్డు దాటుతుండగా అటు వైపు వెహికల్స్ లో వెళ్తున్న వారు గమనించారు.

### దూడను చంపిన చిరుత

నవీపేట్, వెలుగు :మండలంలోని మహంతం శివారులో పశువుల కొట్టం పై చిరుత పులి దాడి చేసి దూడను చంపింది. ఫారెస్ట్ ఆఫీసర్స్, గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేకల లక్ష్మణ్ కౌలుకు చేస్తున్న పొలం వద్ద పశువుల కొట్టం లో నాలుగు గేదెలు, దూడ ఉన్నాయి. శుక్రవారం రాత్రి చిరుత దాడి చేసి, దూడను చంపింది. శనివారం ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వగా, ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెటర్నరీ డాక్టర్ నరేందర్ దూడ మృతదేహానికి పోస్ట్ మార్టం నిర్వహించారు. గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని ఫారెస్ట్ అధికారులు జవహర్, సుధీర్ సూచించారు.

## సైబర్ నేరగాళ్ల కోసం దేశవ్యాప్తంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో గాలింపు



హైదరాబాద్:
సైబర్ నేరగాళ్ల ఆటలు కట్టించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

02

## లోపాలను సరిదిద్దుకుని
## పార్టీని ముందుకు నడపాలి



- గ్రూపులకుపైగా ఐక్యంగా పని చేయాలి
  - మంత్రి సీతక్క సూచన.
- నాయకులు తమ లోపాలను సరిదిద్దుకోవాలి.
- సమాజానికి నచ్చిన నాయకుడిని ముందుకు తేవాలి.
- రానున్న స్థానిక ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేయాలి.
- ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి.
- గ్రామస్థాయి నుంచి నాయకత్వాన్ని పెంచాలి.
- ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి.
- ఎన్నికల సమయంలో బీజేపీ విభజన రాజకీయాలు చేస్తోంది.

02

నిజామాబాద్:
కాంగ్రెస్ పార్టీలో గ్రూపులను పక్కనపెట్టి అందర్నీ నేతలు ఐక్యంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి సీతక్క సూచించారు. టీపీపీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన జనహిత పాదయాత్ర నిజామాబాద్ జిల్లాలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు.




మిగతాది 3లో

## ఎమ్మెల్సీ కవితకు జగదీష్ రెడ్డి కౌంటర్..
## బీఆర్ఎస్‌లో దుమారం!

- కవిత వ్యాఖ్యలకు జగన్ రెడ్డి కౌంటర్.
- "కవితకు నా జీవితం మీద జ్ఞానం - జోహార్లు" అని వ్యంగ్యంగా వ్యాఖ్య.
- "కేసీఆర్ శత్రువుల మాటలు కవిత వల్లే వేశారు" అని ఆరోపణ.
- "కవిత అంశం కేసీఆర్‌తో చర్చలో రాలేదు" అన్నారు.
- కవిత జగదీష్‌ను "లిల్లిపుట్ నాయకుడు"గా తిట్టింది.
- "పార్టీలో పెద్ద నాయకుడి మద్దతుతో నాపై విమర్శలు" అన్నారు.
- "ఆధారాలు నా వద్ద ఉన్నాయి - త్వరలో బయటపెడతాను" అని హెచ్చరిక.
- "నాపై అనుచిత వ్యాఖ్యలపై పార్టీ మౌనంగా ఉంది" అని విరుచుకుపడ్డారు.
- ఈ వివాదంతో బీఆర్ఎస్‌లో కలకలం.

## ఎర్రవల్లి ఫాంహౌస్‌లో కేసీఆర్ కీలక సమావేశం..



సిద్దిపేట:
ఎర్రవల్లి ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ నేతలతో ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ అయ్యారు. మాజీ మంత్రులు హరీష్ రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో కేసీఆర్ సమావేశమయ్యారు. కాళేశ్వరం నివేదిక, స్థానిక ఎన్నికలపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

గత గురువారం కూడా బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది. కేసీఆర్.. ఎర్రవల్లి నివాసంలో ఆ పార్టీ నేతలతో సుదీర్ఘంగా భేటీ అవుతున్నారు. ఈ సమావేశాల్లో కీలక అంశాలపై చర్చించడంతో పాటు పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై కేసీఆర్ దిశా నిర్దేశం చేస్తున్నారు.

మరో వైపు, ఉద్యమ పార్టీగా ప్రస్థానం ప్రారంభించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం పదేళ్లపాటు అధికారంలో కొనసాగి ప్రస్తుతం ప్రతిపక్ష పాత్రకు పరిమితమైన బీఆర్ఎస్ కొత్త తరానికి చేరువ అయ్యేందుకు అనుసరించాల్సిన వ్యూహానికి పదును పెడుతోంది.

# కేసీఆర్ మాటలతోనే..
# ఏపీ 'బనకచర్ల' చేపట్టింది

మొదటిపేజీ తరువాయి
నిజామాబాద్ జిల్లాలో కొనసాగుతున్న జనహిత పాదయాత్ర సందర్భంగా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు."ఎమ్మెల్సీ కవిత ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో నాకు తెలియదు. కులగణన కోసం దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ పోరాటం చేశారు. ఆయన కోరిక మేరకు సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో కులగణన చేపట్టారు. అలాంటిది ఇప్పుడు బీసీలపై కవిత ప్రేమ ఒలకబోస్తున్నారు." అని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి సీతక్కతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కవితకు జగదీష్ రెడ్డి కౌంటర్..

మొదటిపేజీ తరువాయి
బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు గులాబీ పార్టీ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కవిత వ్యాఖ్యలపై తాజాగా జగదీష్ రెడ్డి స్పందిస్తూ..'నా ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి కవితకు ఉన్న జ్ఞానానికి నా జోహార్లు. కేసీఆర్ శత్రువులైన రేవంత్, రాధాకృష్ణలు నా గురించి మాట్లాడిన మాటల్ని మరొక్కసారి వల్లే వేసేందుకు ఆమె చేసిన ప్రయత్నానికి నా సానుభూతిని తెలియజేస్తున్నాను' అంటూ కామెంట్స్ చేశారు.
బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..'కొంత మంది ఏదో చేసేదామని అనుకుంటున్నారు. వ్యక్తులుగా ఏదో చేస్తామనుకుంటే అది వాళ్ల భ్రమ. కేసీఆర్ లేకపోతే ఎవరూ లేరు. అందులో ఎలాంటి సందేహం లేదు. నేను చావు తప్పి కన్నులొట్టబోయినట్టు గెలిచాను. కొంత మంది అది కూడా గెలవలేదు కదా. పార్టీ నిర్ణయమే ఫైనల్. పార్టీ గొప్పది. నల్లగొండలో అంతకుముందు ఎక్కువ సీట్లు వచ్చాయి.. అప్పుడు నేనే కారణం అన్నారు.. ఇప్పుడు ఒక్కడినే గెలిచాను.. అందుకే దీనికి కూడా నేనే కారణం. బనకచర్ల, కాళేశ్వరంపై కేసీఆర్‌తో చర్చించాం. కేసీఆర్‌తో చర్చల్లో కవిత విషయమే ప్రస్తావనకు రాలేదు. కవిత వైఖరి పట్ల సానుభూతి వ్యక్తం చేస్తున్నాను' అంటూ వ్యాఖ్యలు చేశారు.
అంతకుముందు.. ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని టార్గెట్ చేసి కవిత సంచలన ఆరోపణలు చేశారు. లిల్లీపుట్ నాయకుడు నల్గొండ జిల్లాలో పార్టీని నాశనం చేశాడు. కన్ను లొట్టపోయి గెలిచిన నాయకుడు.. ఎన్నడు ప్రజా పోరాటాల్లో పాల్గొన లేదు. అసలు బీఆర్ఎస్‌తో మీకేం సంబంధం?. లిల్లీపుట్ నాయకుడు, నిన్న మొన్న వచ్చిన చోటా మోటా నాయకులు కూడా నాపై మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్‌కు సంబంధం లేని వ్యక్తితో నాపై ఆరోపణలు చేయిస్తున్నారు. వారి వెనక బీఆర్ఎస్‌లో పెద్ద నాయకుడు ఉన్నారు. నా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. సమయం వచ్చినప్పుడు అన్ని బయటపెడతాను. పార్టీ కూడా సమయం వచ్చినప్పుడు స్పందిస్తుంది అంటూ వ్యాఖ్యలు చేశారు.
ఇదే సమయంలో ఒక ఆడ బిడ్డగా నాపైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే తెలంగాణ సమాజం మొత్తం రియాక్ట్ అయ్యారు కానీ, బీఆర్ఎస్ పార్టీ స్పందించలేదు. అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నా అంటూ విమర్శలు చేశారు. దీంతో, కవిత వ్యాఖ్యలు బీఆర్ఎస్ పార్టీలో రాజకీయంగా పెను దుమారం రేపాయి.

# లోపాలను సరిదిద్దుకుని పార్టీని ముందుకు నడపాలి

మొదటిపేజీ తరువాయి
ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్రవ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు." నాయకులు లోపాలను సరిదిద్దుకుని పార్టీని ముందుకు నడపాలి. మనకు నచ్చిన వారిని కాదు.. సమాజానికి నచ్చిన నాయకుడిని ముందుకు తీసుకెళ్లాలి. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేయాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి. గ్రామస్థాయి నుంచి నాయకులను తయారు చేయాలి. ప్రజల కోసం, సమాజాభివృద్ధి కోసమే పనిచేయాలి. ఎన్నికల వచ్చినప్పుడు భాజపా విభజన రాజకీయాలు చేస్తోంది" అని సీతక్క అన్నారు.

# గుట్టుగా గంజాయ్ రవాణా..
# ఇద్దరు నొటోరియస్ క్రిమినల్స్ అరెస్ట్!

నిత్యం అక్రమాలకు పాల్పడడం.. అడ్డదారుల్లో నేరాలు చేయడం పరిపాటిగా చేసుకొని పోలీసు రికార్డుల్లో నొటోరియల్ క్రిమినల్‌గా పేరుగాంచిన లఖన్ సింగ్ మరో సారి గంజాయిని అక్రమ రవాణా చేస్తూ పోలీసులు పట్టు పట్టుబడటం సంచలనంగా మారింది. హైదరాబాద్ పరిధిలోని మంగళహాట్ పోలీసు స్టేషన్‌లో నొటోరియస్ క్రిమినల్‌గా ముద్ర వేసుకున్న లఖన్ సింగ్.. కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తూ ఎస్టిఎఫ్ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. లఖన్ దూల్పేట్‌లోని జియాగూడ కమ్మెలే ప్రాంతం నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్నాడనే పక్కా సమాచారంతో ఎస్టిఎఫ్ అధికారి అంజిరెడ్డి నేతృత్వంలోని బృందం, దూల్పేట్ ఎక్సైజ్ పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో లఖన్ సింగ్ కారును ఆపి చెక్ చేసి గంజాయిని



స్వాధీనం చేసుకున్నారు. కారు ముందు పైలెట్గా వెళ తున్న ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకోవడంతోపాటు.. దానిపై వెళ్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. లఖన్ సింగ్ కారులో 21.425 కేజీల గంజాయి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతనితోపాటు సాయికుమార్, పవర్‌లను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసినట్లు అధికారి అంజిరెడ్డి పేర్కొన్నారు. అయితే అరెస్టు అయిన వారిలో నీరజరాయ్, మీ థన్, కిషన్ సింగ్, తుల్జా సింగ్, సోను, రోహిత్ సింగ్, రిత్విక్, రూప్ నారాయణలు ఉన్నారు. వీరితో పాటు.. దూల్పేట్‌లో రహీంపురాలో శివలాల్‌నగర్ లో రెండు కేజీల గంజాయి కూడా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఒక టూ వీలర్‌తో పాటు వంశీకృష్ణ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో మరో పదిమందిపై కూడా కేసు నమోదు చేసినట్లు అంజిరెడ్డి తెలిపారు.

# సైబర్ నేరగాళ్ల కోసం దేశవ్యాప్తంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో గాలింపు

మొదటిపేజీ తరువాయి
దేశవ్యాప్తంగా విస్తృత గాలింపు చేపట్టి.. ఇప్పటి వరకు 27 మంది మహిళలు సహా 228 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. నిందితుల కోసం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, యూపీ, పశ్చిమబెంగాల్, ఝూర?ండ్ రాష్ట్రాల్లో గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు. నిందితులపై తెలంగాణలో 189, దేశవ్యాప్తంగా 1,313 కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. వారంతా ఈ ఏడాది దేశ వ్యాప్తంగా రూ.92 కోట్లు కాజేసినట్లు వెల్లడించారు.

# చేవెళ్లలో కలకలం..
## ఫాంహౌస్‌లో ఐటీ ఉద్యోగుల డ్రగ్స్ పార్టీ

మొదటిపేజీ తరువాయి
సెరీన్ ఆచార్జ్ ఫాంహౌస్‌లో బర్త్‌డే వేడుకలు పేరుతో డ్రగ్స్, విదేశీ మద్యంతో హంగామా చేస్తుండగా.. ఎస్‌టీఎఫ్ బీ టీమ్, ఎక్సైజ్ పోలీసులు దాడులు జరిపారు. బర్త్‌డే సందర్భంగా ఐటీ ఉద్యోగి అభిజిత్ బెనర్జీ ఈ ఫాంహౌస్‌ను బుక్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఫాంహౌస్ నిర్వాహకుడిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.
పక్కా సమాచారంతో ఫాంహౌస్‌లో పోలీసులు సోదాలు నిర్వహించగా.. ఐటీ ఉద్యోగుల నుంచి రూ.రెండు లక్షల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మూడు లగ్జరీ కార్లను కూడా పోలీసులు సీజ్ చేశారు. డ్రగ్స్‌ను హిమాచల్ ప్రదేశ్ నుంచి తీసుకొచ్చినట్లు పోలీసులు గుర్తించారు. బర్త్‌డే వేడుకల్లో పాల్గొన్న వారికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. ఆరుగురు ఐటీ ఉద్యోగులకు పాజిటివ్ రావడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

# ఏంటీ ఆ ఇద్దరు ప్రముఖులు..
# స్కూల్లో సీవీ ఆనంద్ సీనియర్సా..?

ప్రపంచంలోని అగ్రగామి సంస్థలకు నాయకత్వం వహిస్తున్న ప్రముఖుల్లో ఇద్దరు.. మైక్రోసాఫ్ట్ CEO సత్య నాదెళ్ల, త్వరలో ప్రోక్టర్ అండ్ గాంబిల్ కు కొత్తCEO గా బాధ్యతలు చేపట్టనున్న శైలేష్ జేజురీకర్. ఈ ఇద్దరికీ విద్యా ప్రస్థానం ప్రారంభమైన చోటు బేగంపేట్‌లో గల హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (అదే పాఠశాలలో విద్యనభ్యసించిన మరో ప్రముఖుడు, ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సి.వి. ఆనంద్. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆనంద్ చేసిన ఒక ట్వీట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. అందులో ఆయన శైలేష్, సత్య నాదెళ్లలతో ఉన్న క్లాస్‌రూమ్ స్నేహాన్ని, క్రికెట్ పట్ల ముగ్గురికీ ఉన్న మమకారాన్ని గుర్తు చేసుకున్నారు. పాఠశాల రోజుల్లోనే వారిలోని నాయకత్వ లక్షణాలు కనిపించాయంటూ తెలిపారు. 187 ఏళ్ల చరిత్ర కలిగిన P&G కు తొలి భారతీయ CEO గా శైలేష్ నియమితులవడం విశేషమే కాక, తెలుగు జాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు. ఇక సత్య నాదెళ్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం






లేదు. టెక్ ప్రపంచంలో భారతీయ ప్రతిభను అంతర్జాతీయ వేదికపై నిలిపిన గొప్ప పేరు. ఈ ముగ్గురూ ఒకే స్కూల్‌కి చెందుతూ, తమ తమ రంగాల్లో అగ్రస్థానాలకు చేరుకోవడం.. ఒకే స్థలంలో నాటిన విద్యా విత్తనాలు ఎలా విస్తరించాయో చూపించే అరుదైన ఉదాహరణగా నిలుస్తోంది. ఇక హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివిన చాలామంది విద్యార్థులు.. వివిధ రంగాల్లో దేశవిదేశాల్లో సత్తా చాటుతున్నారు.

# బనకచర్లపై ఎంతవరకైనా పోరాడతాం

మొదటిపేజీ తరువాయి
ఇటీవల దిల్లీలో జరిగిన రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో బనకచర్లపై తమ వాదనలు గట్టిగా వినిపించామని మంత్రి చెప్పారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర విభజన చట్టం, 1980–గోదావరి నదీజలాల పంపిణీ ఒప్పందాలకు వ్యతిరేకంగా ఉందన్నారు. ఇవన్నీ తెలిసిన భారత రాష్ట్ర సమితి నేతలు బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని ఉత్తమ్ విమర్శించారు.రాష్ట్ర జనాభాలో 84 శాతం మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 89 లక్షల రేషన్‌కార్డులు ఉండగా.. తమ ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్య 98.59లక్షలకు చేరిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా 8.64లక్షల కొత్త కార్డులు జారీ చేసిందని తెలిపారు. గతంలో 2.81కోట్ల మందికి నాసిరకమైన దొడ్డు బియ్యం పంపిణీ చేశారని.. ఇప్పుడు 3.17కోట్ల మందికి నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నామని మంత్రి వివరించారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన దొడ్డు బియ్యం ఎవరూ తినడం లేదనే ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు.

# ప్రియుడితో ఆ యవ్వారం.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న భర్త బంధువులు.. తర్వాత ఏం జరిగిందో చూడండి!

వివాహేతర సంబంధాలతో భార్యల చేతుల్లో భర్తల హత్యలు.. భర్తల చేతుల్లో భార్యలు హత్యలకు గురి కావడం ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ కేసులు సమాజంలో వివాహ సంబంధాలలో పెరుగుతున్న ఒత్తిడులు, అనుమానాలు, నమ్మక లేనితనాన్ని తెలియ జేస్తున్నాయి.



ఇలాంటి చాలా కేసుల్లో ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లు చోటు చేసుకుంటాయి. తాజాగా ప్రియుడుతో కలిసి ఉన్న భార్యను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొన్న భర్త బంధువులు వాళ్లిదరిని చితకబాదారు. విచిత్రంగా భర్త వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించాల్సిన భార్య.. తన భర్తకు దేహాశుద్ధి చేసిన ప్రియురాలి బంధువులపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అవాక్కయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం బాలాజీ తండాకు చెందిన రమేష్ కు కొన్నేళ్ళ క్రితం వివాహమైంది. రమేష్ దంపతులకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. తిరుమలగిరి మండలం నాయకుని తండాకు చెందిన వివాహితతో రమేష్ కొంతకాలంగా వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ విషయంలో ఇరు కుటుంబాల మధ్య గొడవలు కూడా తలెత్తాయి. దీంతో ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలు చాలాసార్లు హెచ్చరించినప్పటికీ వినకుండా ఇద్దరూ వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో తిరుమలగిరి మండలం నాయకుని తండాలో వివాహిత ఇంట్లో ఇద్దరు ఏకాంతంగా ఉండగా వివాహిత భర్త బంధువులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను వివాహిత భర్త బంధువులు వీడియో తీసి వైరల్ చేశారు. విషయం తెలుసుకున్న రమేష్ భార్య.. తన భర్తను కొట్టారంటూ వివాహిత మహిళ భర్త బంధువులపై తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్న తన భర్తను ప్రశ్నించాల్సింది పోయి.. స్థంభానికి కట్టేసి కొట్టారంటూ భార్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు అవాక్కయ్యారు. వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్న జంటను పోలీసులకు అప్పగించకుండా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నందుకు వివాహిత భర్త బంధువులపై తిరుమలగిరి పోలీసులు 323, 341 బీఎన్ ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

# నాగార్జున సాగర్ గేట్ల మూసివేత..!

మొదటిపేజీ తరువాయి
అయితే, 18 ఏళ్ల తర్వాత తొలిసారి జులైలో ప్రాజెక్టు గేట్లు ఎత్తటంతో సాగర్‌కు పర్యాటకుల తాకిడి నెలకొంది. ప్రస్తుతం గేట్లు మూసివేయటంతో ఈ విషయాన్ని పర్యాటకులు గమనించాల్సిందిగా అధికారులు సూచించారు. వరద ఉధృతిని బట్టి నీటి విడుదల చేపడుతామని ఈ సందర్భంగా తెలిపారు. కాగా, నాగార్జునసాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులగా ఉంది.

# ఎర్రవల్లి ఫాంహౌస్‌లో కేసీఆర్ కీలక సమావేశం..

మొదటిపేజీ తరువాయి
తెలంగాణ అస్తిత్వ పోరాటాలు, రాష్ట్ర సాధన ఉద్యమంలో బీఆర్ఎస్ పాత్ర, నదీ జలాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం, బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన ఆవశ్యకత తదితరాలను విద్యార్థులు, యువతకు నూరిపోయాలని భావిస్తోంది. టీఆర్ఎస్‌గా అవిర్భవించి గత 25 ఏళ్లుగా బీఆర్ఎస్ సాగిస్తున్న ప్రస్థానం, ఉద్యమ నాయకుడిగా, ప్రభుత్వాధినేతగా కేసీఆర్ చేసిన కృషిని వివరించాలని భావిస్తోంది. ఈ నెల 26న హైదరాబాద్‌లో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే విస్తృత స్థాయి సమావేశం తరహాలో అన్ని జిల్లా కేంద్రాల్లోనూ సదస్సులు నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం ఆగస్ట్ 4 2025

# SIR తో బయట పడుతున్న భయంకర ఓటర్ల రహస్యాలు

## – దేశంలోనికి చొరబడిన అపరిచితులు
## – ఈ ఓటర్ల సవరణ చేపట్టిన భారత ఎన్నికల కమీషన్ చర్యలపై రాహుల్ గాంధీ అణుబాంబులు వేస్తాడట

### శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

**ఈ మధ్య SIR అంటూ కాంగ్రెస్ తో సహా ఇండీ కూటమి లో ఉన్న రాజకీయ పార్టీలు పార్లమెంట్ లోపలా, బయటా ప్రదర్శనలు చేసాయి..**
**SIR అంటే ఏమిటో మనలో చాలా మందికి తెలియదు.**
**SIR అంటే Special Intensive Rivision తెలుగులో "ప్రత్యేక కేంద్రీకృత సవరణ" అని అర్థం.**







ఈ ఏడాది చివర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్ ఓటర్ల జాబితా యొక్క ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ SIR ను ప్రారంభించాలని ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం పెద్ద రాజకీయ వివాదానికి దారితీసింది.
ఈ సవరణ పారదర్శకతను పెంపొందించడానికి మరియు ఓటర్ల జాబితా నుండి అనర్హమైన ఎంట్రీలను తొలగించడానికి ఉద్దేశించబడిందని కమిషన్ వాదిస్తున్నప్పటికీ, ప్రతిపక్ష పార్టీలు ఈ చర్య చట్టబద్ధమైన ఓటర్లను మినహాయించడానికి దారితీస్తుందని పేర్కొంటూ ఆందోళనలు లేవనెత్తాయి. దీని ఫలితంగా పాలక బిజెపి కూడా స్పందించింది, కాంగ్రెస్ జాబితాలోని మోసపూరిత ఎంట్రీలను రక్షించడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించింది.

**– కానీ ఇంతకాలం మన ప్రజాస్వామ్య దేశం లో జరిగిందేమిటి? జరగాల్సింది ఏమిటి? అని భారత ఎన్నికల కమీషన్ ఒక స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఓటర్ల పరిశీలన చేస్తున్నది**

మన దేశ పాలనా పద్ధతుల్లోని లొసుగుల ఆధారంగా కోట్లాది విదేశీయులు మన దేశంలో చొరబడి దేశ ఆర్థిక రాజకీయ సామాజిక స్థితిని అల్లకల్లోలం చేస్తున్నారు. మత జనాభా నిష్పత్తిని సమూలంగా మార్చేస్తున్నారు.దీనితో మన దేశ ఆర్థిక వ్యవస్థను కూల్చి, పాలనను ప్రభావితం చేసి దేశ రాజ్యాంగ మౌలిక ఉద్దేశ్యాలను నిర్మూలించే కుట్ర సాగుతున్నది.ఈ కుట్ర ఏ విధంగా సాగిందో, దానికి సెక్యులర్ ధోరణులు ఏ విధంగా సహరించాయో తెలుసుకోండి.

**– షాకింగ్ న్యూస్**

అతడొక మామూలు వ్యక్తి.కానీ ఆ మామూలు వ్యక్తి జీవితం వెనుక దాగి ఉన్న భయంకరమైన కుట్ర, దేశ భద్రతనే సవాలు చేసింది.

**–అసలు ఎవరు వీళ్లు?**

మీ ఇంట్లో, మీ సమాజంలో, మీ దేశంలో... మీకు తెలియకుండానే తిరుగుతున్న ఆ అపరిచితులు ఎవరు?

**–ఈ కథ చదివితే, నిజం తెలుసుకుంటే మీరు విస్తుపోతారు**

ఒక అనుమానం, ఒక షాక్! మధ్యప్రదేశ్‌లో పోలీసులు ఒక వ్యక్తిని అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు. అతడి పేరు పలాష్ అధికారి. అతడు బంగ్లాదేశీయుడని పోలీసుల అనుమానం. కానీ పలాష్ మాత్రం తాను భారతీయ పౌరుడినని, హిందువునని పదే పదే చెప్పాడు. అతని వద్ద ఉన్న ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, పాన్ కార్డుతో పాటు అనేక పత్రాలు చూసి పోలీసులు కూడా ఆశ్చర్యపోయారు.

**– అన్ని పత్రాల్లోనూ అతడు భారతీయ పౌరుడిగా, హిందువుగా నమోదై ఉంది. ఈ విషయం పై కోర్టులో విచారణ జరిగింది, అంతుచిక్కని ప్రశ్నలు తలెత్తాయి**

కోర్టులో పలాష్‌ని కొన్ని ప్రాథమిక ప్రశ్నలు అడిగారు: పలాష్ అధికారి వయసు 42 సంవత్సరాలు. తండ్రి పేరు రమేష్ అధికారి..అడ్రస్ కాశింపూర్, మాల్దా, పశ్చిమ బెంగాల్ రికార్డులు పరిశీలించగా, ఈ వివరాలు నిజమని తేలింది. రమేష్ అధికారికి నలుగురు కుమారులు ఉన్నట్టు ఓటర్ల జాబితాలో ఉంది. పలాష్, సుభ్రతో, సౌమెన్, రాహుల్.అంటే, రమేష్ అధికారి భారతీయుడు కాబట్టి, ఆయన కుమారులు కూడా భారతీయులే. ఇక్కడి వరకు అంతా బాగానే ఉంది.

**– కానీ న్యాయమూర్తికి ఏదో అనుమానం వచ్చింది**

ఆయన పాత రికార్డులను పరిశీలించాలని ఆదేశించారు. ముఖ్యంగా 2002 నాటి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్ (SIR) చూసి షాక్ అయ్యారు.ఈ పరిశీలనతో కథ ఊహించని మలుపు తిరిగింది.

**– 2002, 2010 నాటి రికార్డుల్లో రమేష్ అధికారికి ఇద్దరే కుమారులు ఉన్నారు: సుభ్రతో, సౌమెన్**

పలాష్, రాహుల్ పేర్లు ఎక్కడా లేవు.కానీ 2015 నాటి ఓటర్ల జాబితాలో నలుగురు కుమారులుగా నమోదైనది.

**– అప్పుడు కథ మరింత ఆసక్తిగా మారింది**

రమేష్ అధికారికి 1993లో వివాహమైంది. మొదటి కుమారుడు సుభ్రతో 1995లో, రెండో కుమారుడు సౌమెన్ 1997లో జన్మించారు.కానీ పలాష్ అధికారి వయస్సు 42 సంవత్సరాలు. అంటే అతడు 1983లో పుట్టాడు. పలాష్ అధికారి తండ్రి రమేష్ అధికారి.. రికార్డుల ప్రకారం తండ్రి పెళ్లికి పది సంవత్సరాల ముందు కొడుకు పలాష్ అధికారి పుట్టాడని దొంగ కాగితాలు చెబుతున్నాయి.
ఇది ఎలా సాధ్యం?
**ఈ విచారణతో చొరబాటు దారుల ముసుగు తొలగింది.**
పోలీసులు ప్రవేశ పెట్టిన రమేష్ అధికారిని కోర్ట్ ఈ ప్రశ్న అడగగానే అతను ఆశ్చర్యపోయాడు. "పలాష్? రాహుల్? వాళ్ళెవరో నాకు తెలియదు" అని చెప్పాడు.

**– దీనితో అసలు నిజం బయటపడింది**

ఈ సంక్లిష్టత నుండి కుట్ర బయట పడింది.పోలీసుల శ్రమ ఫలించింది.

**– పలాష్ అధికారి పేరుతో ఉన్న వ్యక్తి అసలు పేరు షేక్ మోయినుద్దీన్. అతడు బంగ్లాదేశ్ లోని ఖుల్నా, అహ్మద్‌పూర్‌కు చెందినవాడు**

నకిలీ పత్రాలు సృష్టించుకుని, తానొక భారతీయ హిందువుగా నమ్మించి, చొరబడ్డాడు. గత పది సంవత్సరాలుగా కూలి పని చేసుకుంటూ తీవ్రవాద కార్యకలాపాల్లో పాల్గొంటున్నాడు.

**– మరి రాహుల్ అధికారి ఎవరు? అతడి ఆచూకీ కోసం ఇప్పుడు పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు**

ఈ దొంగ ఓటర్లు దేశ భద్రతకు పెను సవాలు.పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోఒక సాధారణ రైతు అయిన రమేష్ అధికారి ఈ విచారణతో ఆశ్చర్యానికి గురయ్యాడు.తనకు తెలియని వ్యక్తి, సంబంధం లేని వ్యక్తి తన బిడ్డగా నమోదు అయ్యి దొంగ పత్రాలతో ఒక భారత ఓటర్ గా, దొంగ ఆధార్ కార్డ్ తో భారత పౌరుడిగా, రికార్డుల్లో ఎలా చేర్చబడ్డాడో స్వయంగా చూసి ఆశ్చర్యపోయాడు.ఈ ఒక్క కేసులోనే కాదు, వేలాది మంది బంగ్లాదేశీ చొరబాటుదారులు అమాయకుల పేర్లు, కుటుంబ వివరాలను దొంగిలించి, నకిలీ ఆధార్, పాన్, ఓటర్ ఐడీలు సంపాదించి, భారతీయులమని నమ్మిస్తున్నారు. ఇది దేశ భద్రతకు ఒక పెద్ద సవాలు.
ఈ సంఘటనతో ఓటర్ల జాబితాలను లోతుగా పరిశీలించి, నకిలీ పౌరులను గుర్తించి, వారిని దేశం నుంచి బయటకు పంపాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతున్నది.ఈ %ూ×=% అనేది నిజమైన ఓటర్లు, నిజమైన పౌరుల గుర్తింపు కొరకు.అసలు భారతీయులు ఎవరూ భయపడాల్సిన పనిలేదు. ఎందుకంటే.., ఈ చర్యలన్నీ మన దేశం, మన పౌరుల భద్రత కోసమే.భారత ఎన్నికల కమీషన్ ఈ సవరణలు చేపట్టగానే ఇండీ కూటమి పార్టీలు కాకి గోల చేస్తున్నాయి.సుప్రీం కోర్ట్ లో కేసు వేసి ఈ విచారణలు సవరణలు ఆపి వేయించాలని తీవ్రంగా ప్రయత్నించాయి.పార్లమెంట్ లో కూడా చర్చలు జరిగాయి.ఇవేవీ సాగక పోవడంతో ఇప్పుడు రాహుల్ గాంధీ భారత ఎన్నికల కమీషన్ పై అణుబాంబు వేస్తానని స్టేట్ మెంట్లు ఇచ్చాడు.రాహుల్ గాంధీకి ఈ నిజ నిర్ధారణలు అవసరం లేదా? బహుశా ఉండకపోవచ్చు. ఎందుకంటే రాహుల్ గాంధీ జార్జ్ సోరోస్, ట్రంప్ లాంటి మన దేశ వ్యతిరేక శక్తుల ఆటలలో పావుగా మారాడని విమర్శలు వినిపిస్తున్నాయి. అవి నిజమని అతని చేష్టలే రుజువులు చూపిస్తున్నాయి.రాహుల్ గాంధీ వద్ద ఉన్న అణుబాంబులు వెంటనే ప్రయోగించాలని భారత రక్షణ శాఖా మంత్రి శ్రీ రాజ్ నాథ్ సింగ్ సవాల్ విసిరాడు.అణు బాంబులు విసిరేటప్పుడు జాగ్రత్తగా ఉండమని రాహుల్ గాంధీకి సూచన చేసాడు.లేకపోతే ఆ అణుబాంబులు రాహుల్ గాంధీ పైనే పేలిపోయే ప్రమాదముందని వ్యంగ్య బాణాలు విసిరాడు.ఇక రాహుల్ గాంధీ భారత ఎన్నికల కమీషన్ పై చేసిన ఆరోపణల విషయమై జవాబు ఇదివరకే ఇచ్చామని, ఇకముందు కూడా జవాబు ఇస్తాము అని ఎన్నికల కమీషనర్ బహిరంగంగా ప్రకటించాడు.రాహుల్ గాంధీ భారత ఎన్నికల కమీషన్ ను దేశం నుండి పారద్రోలుతానని ప్రకటించడం రాజ్యాంగ ద్రోహం. రాజ్యాంగ వ్యతిరేకం.భారత ఎన్నికల కమీషన్ మన భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 324 ప్రకారం ఏర్పడింది.ఈ ఎన్నికల కమీషన్ ను దేశం నుండి పారద్రోలుతానని రాహుల్ గాంధీ బహిరంగంగా ప్రకటించడం రాజ్యాంగ వ్యతిరేకం, దేశ ద్రోహం అని న్యాయ కోవిదుల నుండి ప్రతి విమర్శలు మొదలయ్యాయి.భారత రత్న స్వర్గీయ శ్రీ బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకొని తిరిగే రాహుల్ గాంధీ ఇప్పుడు ఆ రాజ్యాంగ పుస్తకాన్ని ఎక్కడ దాచిపెట్టాడని విజ్ఞులు అంటున్నారు.ఎన్నికల కమీషన్ పేరుతో రాహుల్ గాంధీ చేస్తున్న రాజకీయాలు ఖండనీయం.భారతీయులు జాగ్రత్తగా ఉండాల్సిన సమయమిది.మీ కుటుంబంలో, మీ ఊరిలో, మీకు తెలియకుండానే చొరబడిన అపరిచితులను గుర్తించడానికి మనమంతా అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలి.

## బిల్డింగ్‌పై నుండి పడి విద్యార్థి మృతి

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం విషాదం చోటు చేసుకుంది. విద్యార్థి మూడో అంతస్తు నుండి కిందపడి మృతి చెందాడు. వాకింగ్ చేస్తుండగా ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో అదుపుతప్పి భవనం నుంచి కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు తీవ్ర గాయాలకు గురైన గౌరవ్‌ను చికిత్స నిమిత్తం అపోలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

## బీసీ రిజర్వేషన్ సాధన కమిటీకి మద్దతు తెలుపుతూ సంఘీభావం

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**




జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో మన ఆలోచన సాధన సమితి యాత్రకు మద్దతుగా ఆదివారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పట్టణ అధ్యక్షుడు పర్రె శంకర్ నేతృత్వంలో బీసీ సాధన రిజర్వేషన్ కమిటీ సంఘీభావం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో పర్రె శంకర్‌తో పాటు ఆర్మూర్ గంగారం, రమేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడితే చట్టపరంగా చర్యలు

**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల టౌన్**



కోరుట్ల పట్టణంలోని రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు మరియు చికెన్ సెంటర్లలో తనిఖీలు, నిల్వ ఉంచిన పదార్థాలు మరియు నిషేధిత ప్లాస్టిక్ వాడకంపై పుర అధికారులు ఆదివారం తనిఖీ చేపట్టారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడుతున్న రెస్టారెంట్లు, చికెన్ సెంటర్లు మరియు టిఫిన్ సెంటర్లకు అకస్మిక తనిఖీలు నిర్వహించి వారు వినియోగిస్తున్న సింగల్ యూజ్ ప్లాస్టిక్ మరియు నిల్వ ఉంచిన పదార్థాలను స్వాధీనం చేసుకుని సుమారుగా 13,500/- రూపాయలు జరిమానాలు విధించడంతో పాటు బట్ట సంచులు వాడాలని తెలిపారు.

## ఎంపీటీసీగా గెలవని నాయకులు ఎమ్మెల్యేను విమర్శించడమా!



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల టౌన్**

ఇరవై ఏండ్ల నుండి రాజకీయం చేస్తూ కనీసం వార్డ్ మెంబర్ గా, కౌన్సిలర్ గా, ఎంపీటీసీగా గెలవని చిన్న నాయకుడు జువ్వాడి కృష్ణరావు రాష్ట్రంలోనే ముఖ్యమైన 117 మంది ప్రజాప్రతినిధుల్లో ఒకరైన ఎమ్మెల్యేని సవాల్ కి పిలవడం సిగ్గుచేటని మండల బీఆర్ఎస్ అధ్యక్షులు దారిశెట్టి రాజేష్ అన్నారు. కోరుట్ల మండలం అయిలాపూర్ రైతువేదికలో ఆదివారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సవాళ్ల విసరడం మానుకోవాలని అన్నారు.

## సహకార సంఘంలో యూరియా కొరత లేదు

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**



సహకార సంఘంలో యూరియా కొరత లేదని, అవసరం మేరకు తెప్పిస్తు రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని తిమ్మపుర్ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ బస శ్రావన్ అన్నారు. అదివారం అయన మాట్లాడుతూ గోదుర్, తిమ్మాపుర్ రైతుల కోసం సహకార సంఘంలో ఎలాంటి యూరియా కొరత లేదని, ప్రతి రైతుకు వారు వేసిన పొలం విస్తీర్ణం బట్టి యూరియా పంపిణీ చేస్తున్నామని, యూరియా కొరత అవుతుందనే వదంతులను నమ్మి, రైతులు తమ ఇళ్లలో యూరియా సంచులు నిల్వ చేసుకోవద్దన్నారు.

## నూతనంగా ఎన్నికైన మున్నూరు కాపు కుల బాంధవులకు ఘన సన్మానం



**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 3**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో దుబ్బ మల్లన్న దేవస్థానం ఆవరణలో మున్నూరు కాపు కుల బంధువుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు మున్నూరు కాపు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పొనగంటి మల్లయ్య మున్నూరు కాపు జమ్మికుంట మండల అధ్యక్షుడుగా తోట లక్ష్మణ్ జమ్మికుంట పట్టణ అధ్యక్షులుగా ఏ బూసి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల రాజేందర్ ను ఎన్నికైన సందర్భంగా మున్నూరు కాపు కుల బాంధవులు వారిని ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు పొనగంటి సంపత్ ఆకుల రాజేందర్ పటేల్ మర్రి తిరుపతి. మర్రి అవినాష్.పంతాటి రవీందర్ పొన్నగంటి సారంగం .పొనగంటి రవీందర్. పొనగంటి శ్రీధర్ . చంద మహేందర్. ఏబూసి ఓదెలు ఆకుల పోశయ్య. పూరెల్ల రాకేష్. దాట్ల శ్రీనివాస్ మున్నూరు కాపు కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు

## మౌలిక సదుపాయాల పై దృష్టి సారించండి

### – ఎమ్మెల్యే కు పరాజితుల బృందం విజ్ఞప్తి

**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి జగిత్యాల ఆగస్టు 3**

జగిత్యాల జిల్లాలోని మరీ ముఖ్యంగా ధర్మపురి నియోజకవర్గంలోని ప్రజల మౌలిక సదుపాయాల పై తక్షణం దృష్టి పెట్టండి అయ్యా... అంటూ ఎమ్మెల్యే పరాజితుల బృందం కోరింది.శనివారం రోజున జగిత్యాల జిల్లాలోని ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో సమావేశం అయ్యి మాట్లాడారు.ఎమ్మెల్యే పరాజితుల బృంద బాధ్యులు జర్నలిస్టు విక్రమ్ రెడ్డి వేముల, ముడుగం రాజలింగు, షేర్ల మహేందర్ లు మాట్లాడుతూ ప్రజల సమస్యలు చూస్తూవుంటే చాలా బాధేస్తుందని ముఖ్యంగా రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉండటం కనీస దృష్టి సారించకపోవడం బాధాకరం అని తక్షణం దృష్టి సారించాలని ప్రత్యేక కృషి సల్పి సమస్యల పరిష్కారం చూపించాలని ప్రభుత్వాన్ని వారు కోరారు లేని పక్షంలో కార్యాచరణ చేపడుతామని తెలుపడం జరిగింది ఈ కార్యక్రమంలో నేరేళ్ల అంజన్న గౌడ్, తట్ల రాజు,రవి, తట్ల బిమన్న,సయ్యద్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

# చెట్లు పెంచకపోతే ఇక అందరికీ తద్దినాలే

## మర్రి శంకరయ్య, అకాడమిస్ట్ హైద్రాబాద్



ఆ రోజు సోమయాజులు ఇంట్లో తద్దినం.డాబా మీద కొంతమంది పైకి చూస్తూ, కొంతమంది చుట్టుపక్కల చూస్తూ... కా... కా... అంటూ అరుస్తున్నారు.ఎందుకంటే.. కాకుల కోసం ఆ అరుపులు.తంతు నిర్వహిస్తున్న పంతులు, సోమయాజి ఇంట్లోంచి ఓ అరటి ఆకులో పిండాలు తెచ్చి పిట్ట గోడ మీద పెట్టి తను కూడా అరవటం మొదలు పెట్టారు.కాని కాకులు రావటం మాట అటుంచి, అసలు కను చూపు మేరలో కాకి అన్నదే కనిపించలేదు. చివరకి ఆడాళ్ళూ, మగాళ్ళూ కూడా కలిసి అరవటం మొదలు పెట్టారు. పిల్లలకి ఏమీ అర్థం కాక వాళ్ళూ కూడా గొంతు కలిపారు.కానీ వాళ్ళు గొంతులు కలిపింది కాకులకోసం కాదు. ఆకలేసి అరుస్తున్నారు పిల్లలు.'బామ్మా... కాకులు రావడం లేదే, ఆకలేస్తోంది. అన్నాడు సోమయాజి కొడుకు రామ సోమయాజులు.

**– కాకి ముట్టుకోకుండా ఎవరూ మెతుకు ముట్టడానికి వీల్లేదు – అంది ఖరాఖండిగా బామ్మ.**

అందరూ ముఖాలు చిన్నబుచ్చుకున్నారు.రెండు గంటలు దాటింది.పంతులు గారు కూడా ఆకలితో నక నకలాడుతున్నారు.పంతులుగారూ కాకులు కాదుకదా, కాకి ఈక కూడా కనబడటంలేదు. ఏం చేద్దాం? అని అడిగాడు సోమయాజి.

**– మీరేం కంగారు పడకండి. ఓ పావు గంటలో కాకి వస్తుంది.' అన్నాడు పంతులు**

అందరూ ఆశ్చర్యంగా చూసారు.రెండు గంటలైనా రాని కాకులు. ఓ పావు గంటలో ఎలా వస్తాయండి? అడిగాడు మరో పెద్ద మనిషి.డబ్బులుంటే కొండమీద కోతి దిగి వస్తుంది. ఈ కాకి ఓ లెక్కా? అన్నాడు పంతులు.డబ్బులు చూపిస్తే కాకులు వస్తాయా? అడిగాడు ఓ పెద్ద మనిషి.చూపిస్తే కాదు...డబ్బులు ఇస్తే... అన్నాడు పంతులు.'పావుగంట లోనా' అడిగాడు సోమయాజి.అవునండి కాకపోతే ఓ అయిదొందలు అవుతుంది.' అన్నాడు పంతులు తాపీగా.'అయిదొందలే' అంది సోమయాజి భార్య సోమిదమ్మ.

**– అయిదొందలు కాదు అయిదు వేలయినా సరే కాకి ముట్టిన తర్వాతే అందరూ అన్నాలు ముట్టేది – అంది బామ్మ**

'విన్నారుగా' అన్నాడు పంతులు ఆనందంగా.'అబ్బా నువ్వుండవే అమ్మా... అంటూ పంతులు వైపు చూసి,ఆవిడ మాటలేం పట్టించుకోకండి. అయిదొందలు ఖాయం చేసుకొని అర్జెంట్ గా కాకి చేత కబురు పంపి, కాకి ని రప్పించండి.ఆకలితో అందరూ నక నక లాడుతూ వున్నారు. అన్నాడు సోమయాజి.పంతులు సెల్ ఫోన్ తీసి ఓ నంబర్ డయల్ చేసి. 'హలో... కాకి కామేశం... నేను పిండాల పంతులు కాశీపతి ని... అర్జెంట్ గా ఓ కాకి' అంటూ ఆగి సోమయాజితో 'ఒకటా... రెండా...' అంటూ అడిగాడు.సోమయాజికి అర్థం కాలేదు. 'అంటే' అన్నాడు.'ఒక కాకయితే అయిదొందలు. రెండయితే ఏడు వందల యాభై. రానూ పోనూ ఖర్చులు ఇవ్వాలట.' అన్నాడు పంతులు.'ఒకటి చాల్లెండి' అన్నాడు సోమయాజి.'ఒకటి చాలు. వెంటనే తీసుకురా. పది నిముషాల్లో కాకితో సహా నువ్విక్కడ వుండాలి'ఆ... ఆ... ఇక్కడే.' అంటూ సెల్ ఫోన్ ఆపి 'ఇంకో పావుగంటలో కాకి వస్తుంది.ఈ లోగా వడ్డించమని చెప్పండి.' అన్నాడు పంతులు.కాకి ముట్టిన తర్వాతే వడ్డన ..అంది బామ్మ.అమ్మా ఇరవయ్ నిముషాల్లో కాకి ముట్టుకుంటుంది. నాది గ్యారంటీ... కాకపోతే కాకి విషయంలో నా కమీషను యాభై రూపాయలు కాదనకూడదు. అన్నాడు పంతులు.అందరూ అరవటం మానేసి రోడ్ వైపు చూస్తున్నారు. కాకి కోసం.పది నిముషాల్లో ఆటో వచ్చి ఆగింది.అందులోంచి చేతిలో ముసుగు వేసిన వస్తువుతో దిగాడు కామేశం.అందరూ కామేశం చేతిలో వున్న దాన్ని చూస్తున్నారు.అదిగో కాకి కామేశం వచ్చాడు... కాకీ వచ్చింది. అన్నాడు పంతులు.కామేశం లోపలికి వచ్చాడు.ఏమిటి ఆలస్యం, అడిగాడు కామేశం పంతులుని.నాదేం లేదు నీదే ఆలస్యం.. అన్నాడు పంతులు.అయితే కానీ అంటూ ముసుగు తీసాడు.ఓ పెద్ద పంజరం. రెండు అరలున్నాయి.ఓ అర ఖాళీగా వుంది మరో అరలో కాకి వుంది.అందరూ ఆశ్చర్యపోయారు.కామేశం పంజరం తలుపు తీసాడు.సోమయాజిగారు.. ఆ పిండాల్ని పంజరంలో పెట్టండి. అన్నాడు పంతులు.సోమయాజి అరటాకుతో సహా పిండాల్ని పంజరం మొదటి అరలో పెట్టాడు.కామేశం పంజరం తలుపు మూసేసి.రెండో అర తలుపుని పైకి లాగాడు.అందరూ అలాగే చూస్తున్నారు.కాకి కామేశం వంక చూసింది.కామేశం తల అడ్డంగా వూపాడు.కాకి పిండాలు ముట్టుకోలేదు.అందరూ ఆశ్చర్యపోయారు !!!

బామ్మకూడా చూస్తోంది.బామ్మా... ఏమయింది? కాకి ముట్టుకోవడంలేదు. అడిగాడు రామ సోమయాజి

మీ తాతకి కోపం వచ్చిందిరా...అంది బామ్మ.తాతయ్యా... త్వరగా తిను... మా అందరికి ఆకలేస్తోంది అన్నాడు రామ సోమయాజి.ఏంటి పంతులుగారు ఏమయింది కాకి ముట్టుకోవడం లేదు..అడిగాడు సోమయాజి మీ అమ్మ గారన్నట్టు, మీ నాన్న గారికి నీ మీద కోపం వచ్చి వుంటుంది. అన్నాడు పంతులు.నాన్నా... ఏంటిది... ఏమైంది. నీ కోసం అయిదొందలు ఖర్చు పెట్టి పిలిపించాను. ఇంకా ఏంటి? అన్నాడు కాకితో సోమయాజి.కామేశాన్ని చూసి ఏమయింది కామేశం గారు? అడిగాడు సోమయాజి మీ నాన్న గారికి తీరని కోరికలేమన్నా వున్నాయేమో ! అన్నాడు కామేశం.అవునండి... మా నాన్న గారికి ఓ కోరిక వుంది. ఆయనకి సావిత్రిని పెళ్లి చేసుకోవాలని వుండేది. లవ్ లెటర్ కూడా రాసానని నాకోసారి చెప్పారు. అలా ఆయన కోరిక తీరలేదు' అన్నాడు సోమయాజి.ఆ విషయం నాకెప్పుడూ చెప్ప లేదే అన్నారు బామ్మ గారు ఆశ్చర్యంగా.బావుందమ్మా ఆయన లవ్ స్టోరీ మీకెందుకు చెబుతారు. చెబితే మట్టుకు మీరు వూరుకుంటారా... అందుకే అబ్బాయికి చెప్పి వుంటారు. ఏం సోమయాజి గారు అన్నాడు పంతులు.నాన్నా... నీ కోరిక తీరేది కాదు. ఎందుకంటే నువ్వూ పోయావు. ఆ సావిత్రి కూడా చనిపోయింది.అన్నాడు సోమయాజి కాకితో. వాళ్ళిద్దరూ పైన కలుసుకునే వుంటారు.అది కాదు గాని ఇంకోటి ఏదయినా వుందేమో ఆలోచించండి.' అన్నాడు కామేశం.నాకు తెలిసి ఏమీ లేవు. నాన్నా నీకేమన్నా కోరికలుంటే నాకు గాని, అమ్మకి గాని కలలోకనిపించి చెప్పు తీరుస్తాం. ఇప్పటికే ఆలస్యం అయ్యింది. అందరూ ఆకలి తో కేకలు వేస్తున్నారు,తిను.. అన్నాడు సోమయాజి.

ఆ... ఈ అడ్జెస్ట్ మెంట్ బాగుంది.దోష నివారణార్థం దక్షిణ ఇవ్వండి అన్నాడు కామేశం.నాన్నా... కామేశం గారికి వెయ్యి రూపాయలు ఇస్తా తిను.. అన్నాడు కాకితో సోమయాజి.కాకి మళ్ళీ కామేశం వంక చూసింది.

కామేశం తల అడ్డంగా వూపాడు.కాకి పిండాలు ముట్టుకోలేదు.దోషానికి సరిపోలేదేమో.. అన్నాడు పంతులు.

నాన్నా పదిహేను వందలు ఇస్తాను. తిను అన్నాడు సోమయాజి కాకి మళ్ళీ కామేశం వంక చూసింది.కామేశం తల నిలువుగా వూపాడు.ఆకలి మీద వున్న కాకి పిండాల్ని ఆబగా తినేసింది.అందరూ ఆనంద పడ్డారు.బామ్మా.. తాతయ్య కోపం పోయిందే.. తినేసాడు అన్నాడు రామ సోమయాజి బామ్మతో.అవున్రా కన్నా.. అంది బామ్మ కామేశం గారూ మీరు కూడా భోజనమే చేసి వెళ్ళండి.. అన్నాడు సోమయాజి అమ్మా ఇక బ్రాహ్మలకి వడ్డించండి.. అన్నాడు పంతులు.

**– బ్రాహ్మల భోజనాలు అయ్యాయి. మిగిలిన వాళ్ళు తింటున్నారు**

సోమయాజి పంతులుగారికి తాంబూలంలో అయిదువేల నూట పదహార్లు ఇచ్చి కాళ్ళకి దండం పెట్టాడు.అయ్యా మీ బోటి వాళ్ళు వుండబట్టి... ఇంకా ధర్మం నిలబడింది .. అంటూ తీసుకుని దీవించి, కాకి కమీషను యాభై ఇవ్వాలి మరి...అన్నాడు పంతులు.సోమయాజి పంతులుకి యాభై రూపాయలు ఇచ్చి 'కామేశం గారూ, ఇవిగో ఈ అయిదు వందలు ఈ కాకికి. ఈ పదిహేను వందలు మా నాన్న కోరికకి. ఈ రెండు వందలు మీ రాను పోను ఖర్చులు. ఈ మూడొందలు మీ సంభావన. అంటూ రెండు వేల ఐదు వందలు ఇచ్చాడు సోమయాజి.మహా ప్రసాదం అంటూ తీసుకున్నాడు కామేశం.కాకిని పంజరం లో సర్దుకుంటున్నాడు కామేశం.కామేశం, అయ్యా ఎవరి తద్దినాని కయినా కాకి కావాలంటే నాకు ఫోన్ చెయ్యండి. ఇదిగో నా విజటింగు కార్డు అంటూ తన విజిటింగు కార్డు ఇచ్చాడు సోమయాజికి.సోమయాజి చూసి చదివాడు. 'కా కా సర్వీసెస్' అంటే అని అడిగాడు.కా కా అంటే కానుపు నుంచి కాటి వరకు ..అని వివరించాడు కామేశం.కాకా సర్వీసెస్ లో పురుడు, పుణ్యవచనం, బారసాల, అన్నప్రాసన, అక్షరాభ్యాసం, వడుగు, పెళ్లి, చావు, మాసికం, తద్దినం వరకు.. ఏం కావాలన్నా సామానులతో సహా సప్లయి చేస్తాం. అన్నాడు కామేశం.మీ పని బాగుందండి..అన్నాడు సోమయాజి పదిహేను వందలూ గుర్తుకువచ్చి.

**– నాదే ముందండి... అంతా ఈ కాకిదే కాకిని నమ్ముకుని బతుకుతున్నా అన్నాడు కామేశం**

కాకిని నమ్ముకుని కాదు. కాకిని అమ్ముకుని బతుకుతున్నారు.అవునూ... కాకి కామేశం అంటే మీ ఇంటిపేరు కాకివారా? అడిగాడు సోమయాజి.'కాదండి బాబూ... కూటి కోసం కోటి విద్యలని మంత్రాలు రాని నాకు మా అన్నయ్య కో ఐడియా వచ్చి, ఖాళీ గా వున్న నాకు ఇలా ఓ పంజరం, నాలుగు కాకులు ఇచ్చాడు.

దాంతో నాపేరు కాసుల కామేశ్వరరావు కాస్తా... కాకి కామేశంగా మారిపోయింది. అన్నాడు కామేశం.

'బాగుందండి... బ్రతకడానికో బ్రతుకు తెరువు కావాలిగా. ఇంతకీ మీ అన్నయ్య ఎవరు? అడిగాడు సోమయాజి.ఇంకెవరు... ఇంతవరకు మీ తండ్రి గారి తద్దినం పెట్టించిన ఆ కాసుల కాశీపతే.. అంటూ పంతుల్ని చూపించాడు.అవునండి... వాడికి మంత్రాలు సరిగ్గా అబ్బలేదు. ఇదివరకు హైదరాబాద్ నిండా ఫుల్ గా చెట్లు వుండేవి. ఇప్పుడు ఆ చెట్లు అన్నీ నరికి కాకులకి కూడా చోటు లేకుండా కనిపించిన ఖాళీ స్థలాల్లో ఇళ్లు కట్టేశారు.

దాంతో కాకులు వాలడానికి చెట్లెక్కడున్నాయి? గతంలో ఎవడయినా పీనాసి వాడిని చూస్తే ఈ వెధవ ఎంగిలి చేత్తో కాని తోలడు, అనే వారు.అంటే కాకులు ఎంగిలి మెతుకులు తిని బతుకుతాయని కదా అర్థం. మరి ఇప్పుడు వంటింట్లో మనం వాష్ బేసిన్ లో చెయ్యి కడగటం. దాంతో ఆ ఎంగిలి మెతుకులు కాస్తా డ్రైనేజి గోట్టాలలోకి పోయి అవికూడా వాటికి కరువయ్యాయి.దాంతో కాకులన్నీ సిటీ వదిలి పల్లెలకి పారిపోయాయి. అందుకే తద్దినాలకి కాకులు దొరకటం లేదు. సిటీలో కాకులకి కరువొచ్చింది.కనబడకుండా పోయాయి. అన్నాడు పంతులు.అంతా విన్న బామ్మ గారు ఇదిగో పంతులు పంజరం లో కాకిని పెట్టుకుని తద్దినాలు పెట్టించడం కాదు. ఇలా తద్దినాలు పెట్టించిన ప్రతీ చోటా నాలుగు మొక్కలు నాటించు. రేపు నువ్వు పోయాకా... నీ పిండం తినడానికి నాలుగు కాకులయినా వస్తాయి.' అన్నారు.అందరూ నవ్వారు.దాంతో పంతులు కళ్ళముందు కాకులు తిరిగాయి.నీతి: చెట్లు నరికి, ఇళ్ళూ పెద్ద పెద్ద భవనాలు కట్టడంతో కొన్నాళ్ళకి పట్టాణాలన్నీ కాంక్రీట్ జంగిల్ గా మారి సిటీల్లో ఏ పక్షులు కనబడవు.

పక్షులని చూడాలంటే ఏ జూ పార్క్ కో, పచ్చదనం... పంట పొలాలు వుండే పల్లెలకో వెళ్ళాలి.

అందుకని చెట్లని పెంచుదాం. పక్షులని కాపాడుదాం.

# తుమ్మనపల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 3**

ఉదయం హుజురాబాద్ మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో "అంబేద్కర్ యూత్" నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది అంబేద్కర్ యూత్ నూతన అధ్యక్షుడిగా మిడిదొడ్డి అరుణ్ ఉపాధ్యక్షులు గా మిడిదొడ్డి అశోక్ ప్రధాన కార్యదర్శిగా ఆరపెల్లి పవన్ గౌరవ అధ్యక్షులు మిడిదొడ్డి రాజు క్యాషియర్ మిడిదొడ్డి అజయ్ శ్రీకాంత్ విజయ్ సహాయ కార్యదర్శిగా పొడేటి అభినయ్ కార్యవర్ సభ్యులుగా మిడిదొడ్డి శంకర్ అరుణ్ ఆశు సిద్ధు తదితరులను ఎన్నుకోవడం జరిగింది

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**– సీజన్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి–డాక్టర్ మధుకర్**

**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 3**

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామంలో డాక్టర్ మధుకర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వైద్యులు మధుకర్ మాట్లాడుతూ.. శిబిరంలో భాగంగా డ్రైడే ఇంటింటిని సర్వే పైరిత్రం ఇండోర్ స్ప్రే చేయడం జరిగిందని, రక్త నమూనాలు సేకరించి సీజన్ వ్యాధుల స్క్రీనింగ్ లను నిర్వహించమని,ఈ సందర్భంగా నీటి నిల్వలను తొలగించి సీజన్ వ్యాధులకు కారణమయ్యే దోమల సంతతిని నివారించే చర్యలు చేపట్టామని డాక్టర్ మధుకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇప్పల్ నర్సింగాపూర్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ వైద్యులు స్నిగ్ధ, హెచ్ ఈ ఓ విజేందర్ రెడ్డి, ఏ ఎన్ ఎం పద్మ,కవిత, హెల్త్ అసిస్టెంట్ సత్యం, ఆశ కార్యకర్తలు మంజుల, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఏరియా ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 03:**

అర్జీ 1 ఏరియా ఆస్పత్రిలో సింగరేణి ఆధ్వర్యంలో కేర్ హాస్పిటల్, హైదరాబాద్ వారిచే సూపర్ స్పెషాలిటి ఉచిత వైద్య శిభిరంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్.జి.1 ఏరియా జిఎం డి.లలిత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కత్తిరించి ఇట్టి సూపర్ స్పెషాలిటీ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మెనేజింగ్ డైరెక్టర్ యన్.బలరాం ఆదేశాల మేరకు కేర్ హాస్పటల్, హైదరాబాదు సూపర్ స్పెషాలిటి డాక్టర్స్ చే ఆదివారం సింగరేణి ఏరియా హాస్పిటల్ గోదావరిఖనిలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య సంక్షేమం కోసం ఉచిత వైద్య శిభిరంను నిర్వహించటం జరిగిందనీ జిఎం తెలిపారు. కేర్ హాస్పిటల్ ప్రదానమైన అత్యున్నతమైన వైద్య డాక్టర్ ల బృందం కార్డియాలాజిస్ట్, న్యూరోలాజిస్ట్, మెడికల్ గాస్టోలాజిస్ట్, యురోలాజిస్ట్ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంకు సుమారు 400 మంది హాజరయ్యారు. మెడికల్ క్యాంప్ లో పాల్గొన్న వారికి తగిన వైద్య పరీక్షలు నిర్వహించి వారి అనారోగ్య సమస్యలకు తగిన ట్రీట్ మెంట్, మందులతో పాటు అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు రిఫర్ చేశారు. సింగరేణి ఆధ్వర్యంలో అర్జీ.1 ఏరియా ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపు నిర్వహించిన జిఎంని పలువురు అభినందించారు. సుదర ప్రాంతాలకు పోకుండా ఇక్కడే వారి అనారోగ్య సమస్యలకు తగిన ట్రీట్ మెంట్ తీసుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జిఎం ఆంజనేయ ప్రసాద్, ఏఐటీయుసి బ్రాంచి సెక్రటరీ ఆరేల్లి పోషం, నాయకులు మహేష్, ఏసిఎంఓ డా.అంబిక, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వీరా రెడ్డి,డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వేణు, సీనియర్ పిఓ లు శ్రీనివాస్, ఫిరోజ్ ఖాన్ మరియు బంజారా హిల్స్‌లోని కేర్ హాస్పిటల్స్ వైద్యుల డాక్టర్ ఎ.ఎస్.వి.నారాయణ రావు, సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్, డాక్టర్ సందేశ్ నానిసెట్టి, కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్, డాక్టర్ ఎం.పి.వి.సుమన్, కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్, డాక్టర్ ఎస్.జగదీశ్వర్, కన్సల్టెంట్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, డాక్టర్ ఎన్.భాస్కర్ రెడ్డి, కన్సల్టెంట్ యూరాలజిస్ట్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బతుకుతెరువుకు గల్ఫ్ వెళ్లి..

**– దేశంలో చిక్కుకున్న రామగుండానికి చెందిన ముస్లిం మహిళ**

**– వ్యాళ్ల హరీష్ రెడ్డి చొరవతో కేటీఆర్ సహకారంతో నేడు ఇండియాకు వచ్చిన మహిళ**

**– కేటీఆర్, వాళ్ల హరీష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన బాధిత మహిళ**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 03:**

రామగుండం నియోజకవర్గంలో ఉపాధి దొరకక బతుకుదెరువు కోరకు గల్ఫ్ దేశానికి వెళ్లిన రామగుండం నియోజకవర్గం గోదావరిఖనికి చెందిన ముస్లిం మహిళ అక్కడ చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. పరాయి దేశాలలో చిక్కుకుని బాధపడుతున్న అనేక మందిని కాపాడి క్షేమంగా తీసుకొని వచ్చి ఇంటికి చేర్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామన్న దృష్టికి ట్విట్టర్ %ఇ% ద్వారా తీసుకువెళ్ళి అమ్మాయినీ కాపాడటంలో విహెచ్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు వాళ్ల హరీష్ రెడ్డి సహాయం చేశారు. ఈ సందర్భంగా శనివారం బాధితురాలు ఇండియాకు వచ్చిరాగానే తెలంగాణ భవన్ కు చేరుకుని మాజీమంత్రి కేటీ రామన్న, మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ లను కలిసి ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా సహాయం చేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బాధితురాలి వెంట మాజీ కో అప్షన్ మెంబర్ తస్నిం బాను జాహిద్ పాషా, వీహెచ్ఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సిగిరి రాము, మరియు యాకుబ్ తదితరులు వున్నారు.